ఘనంగా 'మిలాద్ ఉన్ నబీ' వేడుకలు



రాయదుర్గంటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



కళ్యాణదుర్గం: పట్టణంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



ఉరవకొండ: పట్టణంలో జెండా ఊరేగిస్తున్న ముస్లింలు

- మిన్నంటిన ప్రవక్త గీతాలాపన
- మక్కా, మదీనా నమూనాలతో భారీ ప్రదర్శన

రాయదుర్గంటౌన్: జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను రాయదుర్గం పట్టణంలో గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌసెఆజం దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది ముస్లింలు భారీఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పుణ్య స్థలమైన మక్కా, మదీన మసీదులను పోలిన నమూనాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి జెండాలతో ముస్లింలు పట్టణంలో ఊరేగించారు. ఎంతో ఉత్సాహంగా ప్రవక్త మహమ్మద్ (సొఅసా) గుణగణాలను కీర్తిస్తూ నాతీపాక్, సలాములు చదువుతూ 'నారే తక్బీర్ అల్లాహు అక్బర్' అంటూ నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలు ప్రవక్త చూపిన మార్గంలో నడిచి జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. మసీదులో జోహార్ నమాజ్ అనంతరం ప్రత్యేకదువా చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దర్గా మసీదు ముతవల్లి అబ్దుల్ వాహాబ్, చమ్మా అస్లాం, అబూబక్కర్, అబ్దుల్ హమీద్, ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ తదితరులు హాజరయ్యారు.

కళ్యాణదుర్గం: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెండా కట్ట నుంచి టీ సర్కిల్ నుంచి బళ్లారి మిట్ట, కాలేజ్ రోడ్, అనంతపురం ప్రధాన రహదారి గుండా ముస్లింల ఐక్యతను చాటే జెండాలు, జాతీయ జెండాలను చేతపట్టుకుని ఐక్యతా ర్యాలీ చేపట్టారు. అనంతరం టీ సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సోదర భావాన్ని అందరూ అనుసరించాలని మతపెద్దలు సూచించారు. పట్టణ సీఐ తేజమూర్తి సిబ్బందితో కలసి బందోబస్తు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మసీదుల ముతవల్లిలు, మత పెద్దలు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మక్కా, మదీనా ప్రతిమలు

ఉరవకొండ: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం ముస్లింలు మిలాద్ ఉన్‌నబి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా ఆవరణ నుంచి మిలాద్‌ఉన్‌నబీ జెండా ఊరేగింపును వందలాది మంది ముస్లింలు నారేతక్బీర్ అల్లాహ్ అక్బర్, నారేరిసారత్ యారసూల్ అల్లాహ్ అన్న నినాదాలతో చిన్న, పెద్ద జెండాలు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపులో పవిత్ర మక్కా, మదీన ప్రతిమలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక క్లాక్‌టవర్ వద్ద మిలాద్ ఉన్ నబీ జెండా ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీ మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి జెండాకు పూలమాలవేసి ప్రార్థనలు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ , దర్గాహొన్నూరు, కల్‌హోళ, గోవిందవాడ, గోనేహాళ్, నేమకల్లు, కురువళ్లి, బొల్లనగుడ్డం తదితర గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదు నుంచి జెండాను ఊరేగించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కణేకల్లు: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండలకేంద్రమైన కణేకల్లులో గురువారం మిలాదున్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మదీనా మసీదు నుంచి మక్కా, మదీనా నమూనాల జుల్ఫ్‌తో ముస్లింలు ఊరేగింపు చేపట్టారు. అనంతరం మసీదు వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముతవల్లీ ముర్షిద్ పీర్ ఖాద్రీ, మైనార్టీ నాయకులు ఎంపీ సర్మస్, నేమ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.






రాయదుర్గంలో మక్కా, మదీనా నమూనాల ప్రదర్శన, ఉరవకొండలో జెండాకు పూలమాల వేస్తున్న ప్రణయ్‌రెడ్డి, ఉద్దేహాళ్‌లో జెండా ఊరేగిస్తున్న ముస్లింలు, కణేకల్లులో మక్కా మదీనా నమూనాల ఊరేగింపు

ఆర్థిక నేరగాడు చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక నేరగాడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు.. స్కిల్ స్కాంలో చంద్రబాబు అవినీతికి పాల్పడడంతో జైలుకెళ్లాడు. ఆర్థిక నేరాన్ని న్యాయస్థానాలు ధ్రువీకరించినా టీడీపీ దొంగలు మాత్రం కల్లుతాగిన కోతుల్లా వ్యవహరిస్తున్నారు. పైగా కక్షసాధింపు అని, అక్రమ కేసులు పెట్టారని నీచంగా మాట్లాడే స్థితికి దిగజారారు. ఈ దొంగలకు ఒక్కటే చెపుతున్నా, నిజాయతీపరులైతే న్యాయస్థాల్లో రుజువు చేసుకోవాలి. ఇష్టమెచ్చినట్టు మాట్లాడే విధానం మానుకోవాలన్నారు. ఓ మహిళ జడ్జిపై నోటికొచ్చినట్టు వాగుతున్నారు. ఆ విషయం రాష్ట్రపతి వరకూ వెళ్లింది. వారిపై చర్యలు తీసుకునేలా కోర్టులో కేసు నమోదైందన్నారు. బాబు దొంగ అనేందుకు ఆనేక ఆధారాలు లభించాయన్నారు. న్యాయస్థానాలు బాబు వాదనలు నమ్మేస్థితిలో లేవన్నారు. ఏవేవో కారణాలు చూపుతున్నారే తప్పా, తప్పు చేయలేదని ఏ రోజూ కోర్టులో వాదనలు వినిపించలేదన్నారు.

కాలవా ఖబడ్దార్..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నోరు అదుపులో పెట్టుకోవాలని విప్ హెచ్చరించారు. ఓ దొంగకు అనుచరుడివి.. 40 ఏళ్లుగా తోడున్నానని నీవే చెప్పుతున్నావ్. దోపిడీ విషయాలు నీకు తెలీదా అని ప్రశ్నించారు. నిన్ను కూడా విచారణకు పిలవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు విషయాల్లో చంద్రబాబు దోపిడీకీ పాల్పడ్డారని, అందులో నారా లోకేష్ పాత్రకూడా ఉందన్నారు. ఈ కేసుల్లో 140 మంది సాక్షులు, 4,000 డాక్యుమెంట్లు విచారించాకే బాబుపై కేసులు నమోదు చేశారన్నారు. ఇవన్నీ తెలిసి కూడా కాలవ అడ్డంగా వాదిస్తున్నాడన్నారు. ఈ పరిణామాలు చూస్తే కాలవపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నారన్నారు. కాలవా.. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ఉత్తర ప్రగల్భాలు వదిలిపెట్టి విదేశాల్లో దాచుకున్న నిందితులు పెండ్యాల శ్రీనివాస్, వాసుదేవన్, కిలారి రాజేశ్‌ను ఇండియాకు తీసుకురావాలన్నారు. నారా భువనేశ్వరి చూస్తే రూ.371 కోట్లు లెక్కలేదంటారు. ఆ డబ్బు చిల్లరతో సమానమంటూ హేళనగా మాట్లాడుతున్నారు. ఈ లెక్కన చంద్రబాబు దోపిడీ రూ.6 లక్షల కోట్లకు తక్కువ ఉండదన్నారు. ఇప్పటి వరకు స్టే ఉన్న కేసులన్నీ విచారిస్తే బాబు శేషజీవితమంతా జైల్లోనే గడపాల్సి ఉంటుందన్నారు. ఇక టీడీపీ శకం పూర్తిగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ భోజరాజ్‌నాయక్, ఎంపీపీలు విద్యావతి, పద్మావతి, జెడ్పీటీసీలు పీఎస్ మహేష్, నీలవేణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, పట్టణ, మండల కన్వీనర్లు అరవ శివప్ప, ఎం.వన్నూర్ స్వామి, గౌని కాంతారెడ్డి, ఆలూరు చిక్కన్న, రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి 'హిందూ మహాగణపతి'



రాయదుర్గంటౌన్: నిమజ్జనానికి తరలుతున్న హిందూ మహాగణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలో మొట్టమొదటిసారి ప్రతిష్ఠించిన హిందూ మహాగణపతి నిమజ్జన వేడుకలు మిన్నంటాయి. వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానంలో 11 రోజుల పాటు మహాగణపతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు గురువారం మహాగణపతి నిమజ్జనోత్సవ శోభాయాత్రతో భక్తజన సందోహం మధ్య వైభవంగా సాగింది. శోభాయాత్రను గురువారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభించారు. సంప్రదాయ నృత్యాలు, డీజే డ్యాన్సులతో రాయదుర్గం పట్టణం దద్దరిల్లింది. అలాగే డప్పులు, నందికోలు, తాషాలు, చెక్కభజన, కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు దేవరెడ్డిపల్లి రాజేష్, గౌని ప్రతాప్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కణేకల్లు క్రాస్‌లోని హెచ్చెల్సీలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అర్బన్ సీఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

లక్కీడిప్ కారు విజేత కొల్లప్ప

నిమజ్జనానికి ముందు నిర్వహించిన లక్కీ డిప్ లాటరీలో మొదటి బహుమతి రెనాల్ట్ క్విడ్ కారు పులకుంటకు చెందిన కొల్లప్ప దక్కించుకుకోగా రెండో బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఉడేగోళంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివానందను వరించింది. ముందుగా 20 మందిని డిప్ ద్వారా ఎంపిక చేశారు. అనంతరం వాటిలో నుంచి మొదటి, ద్వితీయ బహుమతులతోపాటు 18 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విజేతలను ముఖ్య అతిథి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అభినందించారు. అలాగే వేలంలో స్వామి లడ్డూ ప్రసాదాన్ని 2వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్ రూ.60,116కు సొంతం చేసుకున్నాడు.

స్వయంభేశ్వర వినాయకుని ఊరేగింపు

కణేకల్లు: కణేకల్లులో వినాయక చవితి వేడుకలు గురువారం ముగిశాయి. 11 రోజుల నుంచి ప్రత్యేక పూజలందుకున్న స్వయంభేశ్వర వినాయకున్ని మెయిన్‌రోడ్డులో మేళాతాళాల నడుమ ఊరేగించారు. యువకులు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి హెచ్చెల్సీలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



రాయదుర్గంటౌన్: కారు విజేతకు తాళాలు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



కణేకల్లు: స్వయంభేశ్వర వినాయకున్ని ఊరేగిస్తున్న దృశ్యం

175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి వరకూ పార్టీ కార్యక్రమాలు తీసుకెళ్లేలా క్యాడర్ మొత్తం సమాయత్తం కావాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డులో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడారు. వచ్చే రెండు నెలలకు సంబంధించి రెండు భారీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సీఎం జగన్ మనందరిపై ఉంచారన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలసి పార్టీ నాయకత్వం మొత్తం ఇంటింటికీ వెళ్లి అపద్దాల చంద్రబాబు నాటకం.. జగనే మా నమ్మకం అంటూ వివరించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ పార్టీ జెండా కట్ట ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే బూత్‌స్థాయి నుంచి పార్టీ మరింత బలోపేతం చేసేలా క్యాడర్ మొత్తం కలసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల, సచివాలయ కన్వీనర్లు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

4న సాధారణ సర్వసభ్య సమావేశం

రాయదుర్గం రూరల్: రాయదుర్గం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. 26వ తేదీ జరగాల్సిన సమావేశం అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదని ప్రజాప్రతినిధులు సమావేశాన్ని బహిష్కరించిన దరిమిలా పునః నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన బుధవారం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పేదలకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష



సర్వేను పరిశీలిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సందేష్‌కుమార్

రాయదుర్గంటౌన్: ప్రజారోగ్యమే లక్ష్యంగా..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రత్మక నిర్ణయంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారింది. జబ్బులతో ఏ ఒక్కరూ బాధపడకూడదని, క్షేత్రస్థాయిలో వారిని గుర్తించి ఇంటి ముంగిటే వారికి మెరుగైన వైద్యం అందించాలనే గొప్ప సంకల్పంతో ఏక్కడ జరగని విధంగా ప్రభుత్వం వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, వైద్యులతో సమగ్ర సర్వే నిర్వహిస్తోంది. సర్వే అనంతరం చేపట్టాల్సిన మెడికల్ క్యాంపులు ఏర్పాటుపై కసరత్తు మొదలైంది. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. తరువాత ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఆరోగ్య సమస్యలపై ఆరా తీసి అవసరమైన వారికి ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దనే చేసి అర్హులైన వారిని మెడికల్ క్యాంపుకు టోకెన్లను జారీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాయదుర్గం పట్టణంలో ఇప్పటికే 21 వేల మందిని ఆరోగ్య సిబ్బంది కలుసుకుని అవసరమైన వారికి టోకన్లు జారీ చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, అర్బన్ హెల్త్ సెంటర్ల పర్యవేక్షకుడు, వైద్యాధికారి సందేశ్‌కుమార్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తొలి విడతలో ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధం చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో 30న తొలి వైద్యశిబిరం

పట్టణ పరిధిలో ఇప్పటి దాకా సర్వే పూర్తి వైద్యం అవసరమైన వారికి ఈ నెల 30 పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో తొలి మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఆ క్యాంపులో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. శిబిరాలకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి వైద్య బృందం వచ్చి వైద్య చికిత్సలు అందజేయనున్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు, మందులు అన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నారు. సమస్య తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం కార్యక్రమంలో గతంలో ఏ ప్రభుత్వంలో చూడలేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడుతుండడంపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిరిడీసాయి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం , అర్చనలు, మహా మంగళహారతి, హారతులు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్ల కీ ఉత్సవం చేపట్టారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆ లయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు అనంతస్వామి, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



పొట్టిపాడులో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడులో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీ కారం చుట్టారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయి. సర్పంచు కె.సురేంద్ర, ఎంపీటీసీ నాగలక్ష్మి పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చిరుతల సంచారంతో బెంబేలు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తుండడంతో రైతులు, పశువుల కాపర్లు భయాందోళనకు గురవుతున్నారు. మూడు రోజుల కిందట కెంచంపల్లి రామాంజికి చెందిన గేదె, నాగప్పకు చెందిన మేకను చిరుతలు పొట్టన పెట్టుకున్నట్లు బాధిత రైతులు వాపోయారు. కదరంపల్లి, బెస్తరపల్లి, కలిగొలిమి గ్రామ రహదారుల్లో చిరుత సంచరిస్తుండడంతో రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లలేక పోతున్నామని రైతులు మంజు, నాగరాజు, తిప్పేస్వామి తదితరులు తెలిపారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని చిరుతలను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని వారు కోరారు.

పేదలకు అన్నదానం



ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణానికి చెందిన ఆదాం ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, వారి బంధువులు, విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జాఫర్‌సాబ్, ఉపాధ్యక్షుడు దావూద్‌సలాం, సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని సన్‌రైజస్ పాఠశాలలో స్వాన్స్ క్లబ్ అధ్యక్షుడు ఈశ్వరప్ప అధ్యక్షతన గురువారం ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన చెన్నబసయ్యను ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడిగా ఉంటూ ఎంపీడీఓ పోస్టు సాధించిన కవిరాజును సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

ముద్దలాపురం చెరువుకు కృష్ణా జలాలు



ముద్దలాపురం చెరువు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం చెరువులోకి కృష్ణా జలాలు చేరుతున్నాయి. పి.నారాయణపురం వద్ద వెళ్లిన హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ మీదుగా కృష్ణాజలాలు ప్రవహిస్తున్నాయి. వారం రోజుల క్రితం ముద్దలాపురం చెరువుకు హంద్రీ–నీవా కాలువ నుంచి నీరు విడుదల చేశారు. చోళసముద్రం మీదుగా పిల్ల కాలువ ద్వారా నీరు ముద్దలాపురం చెరువులోకి చేరుతోంది. ఈ చెరువు పూర్తిగా నిండితే పిల్ల కాలువ ద్వారా ఇప్పేరు చెరువులోకి నీరు చేరుతుంది. ఈ రెండు చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెంపొంది సుమారు 10 వేల ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం ఉంటుంది. చెరువులోకి నీరు చేరుతుండడంతో ఆ రెండు గ్రామాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సర్మస్ హుసేనీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

బిల్లు ఆమోదంపై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: కాంట్రాక్టు ఉద్యోగుల బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీఓ భవనంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో తాలూకా కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. 22 ఏళ్లుగా నలుగుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఏపీ ఎన్జీఓ నాయకులు ఫార్మసిస్ట్ మహేష్, కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ జాన్సన్, యూనియన్ నాయకులు నర్సారెడ్డి, గంగరాజు, పురుషోత్తం, వీరశేఖర్, హనుమంతరాయుడు, గోవిందరాజులు, నారాయణ తదితరులు ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు నారాయణ, తిప్పేస్వామి, గోవిందరాజులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

కుందుర్పి: పండ్లతోటల పెంపకంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ వెంకటనాయుడు ఇన్‌చార్జ్ ఏపీఓ పరంధామ సూచించారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద మండలంలోని బసాపురం, కుందుర్పి,జంబుగుంపల తదితర పంచాయతీల్లో రైతులు మెట్టభూముల్లో సాగుచేసిన వివిధ రకాల పండ్లతోటలను గురువారంవారు పరిశీలించారు. పండ్లతోటల పెంపకం ద్వారా చేకూరే లబ్ధిని రైతులకు వివరించారు. మండల వ్యాప్తంగా రెండేళ్ల కాలంగా 670 ఎకరాల్లో ఉపాధి పథకం ద్వారా పండ్లతోటల సాగుకు ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు తోడ్పాటునిస్తోంన్నారు. రైతులు పండ్లతోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో పోలీసులు

కంబదూరు: మండలంలోని ఓబిగానిపల్లి, జాలేడు గ్రామాల మధ్య గురువారం సెబ్ పోలీసులు కర్ణాటక నుంచి అక్రమంగా తరలుతున్న మద్యాన్ని పట్టుకున్నారు. సెబ్ సీఐలు నాగేంద్ర ప్రసాద్, మొహిద్దీన్‌బాషా, సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. దాడుల్లో ఒక బైకు, 576 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

కుందుర్పి: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను గురువారం కుందుర్పిలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701